# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 24 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మే 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలలైంది. సప్లిమెంటరీ పరీక్షలు మే22నుంచి 29 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఇంటర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసిన నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు కార్యదర్శి క్రిష్ణాదిత్య బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇదే సమ యంలో వొకేషనల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జూన్ 3నుంచి 6 వరకు ప్రాక్టికల్స్, జూన్ 9న ఫస్టియర్, 10న సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

# పాకిస్థాన్‌తో పూర్తిగా కటీఫ్

- పాక్ పౌరులకు స్థానం లేదు..
- 48గంటల్లోగా దేశాన్ని వీడాలి
- సింధు జలాల ఒప్పందాన్ని ఆపేస్తాం
- అత్తారి చెక్‌పోస్టు మూసివేస్తాం
- ఎంబసీ సిబ్బంది కుదింపు
- పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ సంచలన నిర్ణయాలు
- ప్రధాని మోదీ నేతృత్వంలో భద్రతా క్యాబినెట్ కమిటీ భేటీ



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత్ సీరియస్‌గా తీసుకుంది. పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ మీటింగ్‌లో పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్ పౌరులు వెంటనే భారత్‌ను వీడాలని కేంద్ర విదేశాంగ శాఖ తేల్చి చెప్పింది. పాకిస్థాన్ పర్యటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని ఆ దేశ పౌరులను భారత్‌లోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.అటు పాక్ హైకమిషనర్‌ను సైతం దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు చెప్పిన కేంద్రం ఇండస్ వాటర్ ఒప్పందాన్ని కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రత్యేక వీసాలను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కేబినెట్ కమిటీలో చర్చించిన అంశాలకు సంబంధించి భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ వివరాలు వెల్లడించారు.

ఈ మేరకు పాకిస్థాన్ తో దౌత్య సంబంధాలను పూర్తిగా తెంచుకుంటున్నట్లు ప్రకటించింది. పాక్ పౌరులు, పర్యాటకులు వారంలో తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. అటారీ చెకోపోస్టును వెంటనే నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ కు చెందిన పౌరులను భారత్‌లోకి అనుమతించేది తేల్చి చెప్పింది. .పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ కమిటీ భేటీలో ఈ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. పాక్ కు చెందిన పౌరులు 48 గంటల్లో దేశాన్ని వీడాలని ఆదేశించారు. పాకిస్థాన్ పర్యటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాకిస్థాన్ పౌరులు భారత్‌లోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. మరోవైపు భారత్ లో ఉన్న పాక్ హైకమిషనర్‌ను సైతం దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని తక్షణం తాత్కాలిక నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు నిలిపివేసేంతవరకు ఇది అమలవుతుంది.

దిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నేవీ, వైమానిక సలహాదారులు వారం రోజుల్లోనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. అలాగే పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఉన్న భారత హైకమిషన్ కార్యాలయంలో ఉన్న ఇదే హెూదా గల భారత ఉద్యోగులను వెనక్కు పిలిపిస్తోంది. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న అటారీ చెక్‌పోస్ట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్ వైపు నుంచి సరైన పత్రాలతో వెళ్లినవారు కూడా ఈ ఏడాది మే 1 లోపు తిరిగి రావాలి.

**మోదీ అధ్యక్షతన జరిగిన సీసీఎస్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవే..**

1. 1960 నాటి సింధు జలాల ఒప్పందం వెంటనే రద్దు చేయబడుతుంది

2. అటారీ- వాఘా సరిహద్దు తక్షణమే మూసివేయబడుతుంది. చెల్లుబాటు అయ్యే ఎండార్స్‌మెంట్‌లతో సరిహద్దు దాటినవారు 2025 మే 1లోపు ఆ మార్గం గుండా తిరిగి వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

3. సార్క్ వీసా మినహాయింపు పథకం (%ూఎజుూ%) వీసాల కింద పాకిస్తాన్ జాతీయులు భారతదేశానికి రావడానికి అనుమతించబడరు. పాకిస్థానీ పౌరులకు గతంలో జారీ చేసినటువంటి %ూఎజుూ% వీసాలు రద్దు చేయబడినట్లు పరిగణించబడతాయి. %ూఎజుూ% వీసా కింద ప్రస్తుతం భారతదేశంలో ఉన్న ఏ పాకిస్తానీ జాతీయుడైనా భారతదేశంను 48 గంటలలోపు వీడి వెళ్లాల్సి ఉంటుంది.

4. న్యూ ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లోని రక్షణ, సైనిక, నౌకాదళం, వైమానిక సలహాదారులను పర్సనా నాన్ గ్రేటాగా ప్రకటించారు. వారు భారతదేశం విడిచి వెళ్ళడానికి ఒక వారం సమయం ఇచ్చారు. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ నుంచి భారతదేశం తన రక్షణ, నౌకాదళం, వైమానిక సలహాదారులను ఉపసంహరించుకుంటుంది. సంబంధిత హైకమిషన్లలోని ఈ పోస్టులు రద్దు చేయబడినట్లు పరిగణించబడతాయి.

5. రాయబార కార్యాలయాల సిబ్బందిని 55 నుంచి 30కి తగ్గించాలని నిర్ణయం.



## ముష్కరులు వీరే...

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కశ్మీర్ ఫహల్గామ్‌లో ఇటీవల నరమేథం సాగించినట్లు అనుమానిస్తున్న ఉగ్రవాదులు ముగ్గురి ఊహాచిత్రాలను (స్కెచ్) జమ్మూ కశ్మీర్ పోలీసులు బుధవారం విడుదల చేశారు. వీరికి సంబంధించిన వివరాలు , ఆచూకి ఉంటే తమకు తెలియచేయాలని ప్రకటన వెలువరించారు. మంగళవారం ముష్కరులు జరిపిన అతి సమీపపు కాల్పుల్లో 28 మంది మృతి చెందారు. వీరిలో ఎక్కువగా పర్యాటకులే ఉన్నారు. రెండు మూడు రకాల స్కెచ్‌లను , ఘటనాస్థలిలోని ప్రత్యక్ష సాక్షుల కథనాల మేరకు ఇప్పుడు విడుదల చేశారు. ఉగ్రవాదుల మూకను పట్టుకోవడానికి పోలీసు బలగాల దర్యాప్తు ముమ్మరం అయింది. ఉగ్రవాదులు ముగ్గురూ యువకులే. వీరిలో నూనుగు మీసాలు, చిన్నపాటి గడ్డంతో ఉన్నవాడు కూడా ఒక్కడున్నాడు. ఈ ఉగ్రవాద అనుమానితుల పేర్లు అసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హా అని , వీరికి మూసా, యూనస్, అసిఫ్ అనే మారు పేర్లు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. కశ్మీర్‌లో ఇంతకు ముందు జరిగిన పలు ఉగ్రవాద దాడుల వెనుక వీరు ఉన్నట్లు, ఇప్పుడు జరిపింది వీరి చర్యలలో పరాకాష్ట వంటిదని వివరించారు. పాకిస్థాన్ కేంద్రీకృత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా కొత్తగా పుట్టుకొచ్చిన ది రెసిస్టెంట్స్ ఫోర్స్ ( ఆర్ఎఫ్)కు చెందిన వారుగా వీరిని అనుమానిస్తున్నారు. ఫహల్గామ్‌లోని బైసారన్ పర్యాటక పచ్చికమైదానాలలో వీరు రక్తపాతం సృష్టించి వెళ్లారు. నిషేధిత లష్కరే తోయిబా ఆగకుండా జరుపుతున్న ఉగ్రవాద దాడుల జాబితాలో ఇప్పుడు ఈ ఘటన కూడా చేరింది. స్కెచ్‌లను కేంద్రీయ భద్రతా బలగాలు , నిఘా సంస్థలు కూడా ధృవీకరించాయి. ఈ ముగ్గురిలో ఒక్కడు హతుడైనట్లు ప్రకటించారు. మిగతా ఇద్దరిని పట్టుకుంటే దాడి వివరాలు, పాకిస్థాన్ లోగుట్టు తెలిసేందుకు వీలుంటుంది. ఫహల్గామ్ ఇతర ప్రాంతాలలో భద్రతా బలగాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే మరి కొందరు ఉగ్రవాదులు పొంచి ఉన్నట్లు, మరిన్ని దాడులను చేసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడైంది.

### ఇద్దరు ఉగ్రవాదుల హతం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదులు నరమేధం సృష్టించాక... భద్రతా బలగాలు రంగంలోకి దిగి ఇద్దరు ముష్కరులను మట్టుపెట్టాయి. ముష్కరుల ముఖ చిత్రాలనూ విడుదల చేశాయి. మిగతా ముష్కరుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అయితే ఈ దాడిపై ఇంటిలిజెన్స్ విభాగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని, వారిలో అత్యధికంగా లష్కరే తొయ్యిబా ముఠా సభ్యులున్నారని భద్రతా సంస్థలు వెల్లడించాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆదారంగా ఈ విషయం వెల్లడవుతోంది. వారిలో 18 మంది జైషే మహమ్మద్ , 25 మంది లష్కరే ముఠాలకు చెందిన వారని వాటిని బట్టి తెలుస్తోంది. ముగ్గురికి హిజ్బుల్ ముజాహిద్దీన్‌తో సంబంధం ఉందని, వారు కూడా పాకిస్థాన్‌కు చెందిన వారని, భద్రతా సంస్థలకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు. ఇక 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోల్చుకుంటే ఆ సంఖ్య తక్కువగా ఉంది. ఈ విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా అనుబంధ విభాగం ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి తెగబడినట్టు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల తరువాత సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ రంగం లోకి దిగి దర్యాప్తు చేపట్టింది. మరోవైపు ఉగ్రదాడి దృష్ట్యా ఢిల్లీ లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉండగా, పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల ఊహా చిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు.

## మృతులకు అమిత్ షా ఘన నివాళి..



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన మృతదేహాలను కేంద్ర మంత్రి అమిత్ షా సందర్శించారు. అనంతరం ఆ యా మృతదేహాలకు ఆయన ఘన నివాళు లర్పించారు. ఆ తర్వాత బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఉంచి ఆ యా మృతదేహాల వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి వారికి ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారిని ఓదార్చారు. ఈ ఘటనపై వివరాలను కేంద్ర మంత్రి అమిత్ షా వారిని అడిగి స్వయంగా తెలుసుకొన్నారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో విడిచి పెట్టదని వారికి ఆయన స్పష్టం చేశారు.

హెల్ప్ లైన్ నెంబర్లు..

ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ శ్రీనగర్: 0194-2457543, 0194-2483651బీ 7006058623బీ

24 బై 7 టూరిస్ట్ హెల్ప్ డెస్క్: పోలీస్ కంట్రోల్ రూమ్, అనంత్ నాగ్: 9596777669, 01932-225870, వాట్సప్ నెంబర్ : 9419051940బీ

జమ్మూ కశ్మీర్ టూరిస్ట్ డిపార్ట్‌మెంట్: 8899931010, 8899941010, 9906663868, 9906906115.

## వాళ్లకు గట్టిగా బదులిస్తాం

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం లో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు.ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు. పహల్గాం ఘటనపై, శ్రీనగర్‌లో భద్రతా చర్యలపై ఆయన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠితో చర్చించిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు.



## బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమయ్యిందన్నారు. బుధవారం హైడ్రా కమిషనర్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో బతుకమ్మ కుంట అభివద్ధి పనులను వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దఎత్తున హాజరయ్యారు. అభివద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు.

### నీటిబొట్టుతో సరికొత్తగా హైడ్రా లోగో

నీటిబొట్టుతో సరికొత్తగా లోగోను హైడ్రా విడుదల చేసింది. ఇక హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నూతన లోగోతోనే కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు ఈవీడీఎం లోగోనే హైడ్రా వినియోగిస్తూ వచ్చింది.అయితే ఇప్పుడు కొత్తగా జలవనరుల శాఖను పోలి ఉండేలా హైడ్రా లోగోను రూపొందించారు. హెచ్ అక్షరంపై నీటి బొట్టుతో హైడ్రా లోగోను రూపకల్పన చేశారు. హైడ్రా కార్యాలయం, వాహనాలు, సిబ్బంది యూనిఫాంపై కూడా కొత్త లోగో వేస్తారు. అలాగే హైడ్రా అధికారిక ఎక్స్(ట్విట్టర్) అకౌంట్‌కు కొత్త లోగోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టారు.

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

**జపాన్‌లో రూ. 12,062 కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జపాన్ దేశ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రతినిధులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఈ నెల 16 నుంచి ఏడు రోజుల పాటు జపాన్ దేశంలో పర్యటించింది. ఈ పర్యటనలో రాష్ట్రానికి 12,062 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. పలు రంగాల్లో సహకారం, సాంకేతిక భాగస్వామ్యం కోసం చర్చలు జరిపింది.

## కాశ్మీర్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురండి..

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేటీఆర్ విజ్ఞప్తి**

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లి తెలంగాణకు చెందిన 80 మంది పర్యాటకులు నిన్నటి నుంచి శ్రీనగర్‌లో చిక్కుకుపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని, వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ పర్యాటకులకు అవసరమైన సంరక్షణ, సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ కోరారు. వారిని సురక్షితంగా ఇండ్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం





- ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్
- 88 మంది ఓటు హక్కు వినియోగం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ కట్టుదిట్టంగా ఆంక్షలు అమలు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు పూర్తయింది. బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డా. కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తొలుత పోలింగ్ బూత్ నెంబర్ 1లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దీన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలా ఓటు వేశారు. అధికార కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రస్తుత లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పోలింగ్ బూత్ నెంబర్ 2లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఓటు వేశారు మధ్యాహ్నం వరకు ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పోలింగ్ బూత్ నెంబర్ 1లో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఓటు వేశారు.

జీహెచ్ఎంసీ లోకల్‌బాడీ స్థానం పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి మొత్తం 112 మంది ఓటర్లున్నారు. వీరిలో 50 మంది ఓటర్లు ఎంఐఎం పార్టీకి చెందిన వారే. పోలైన ఓట్లలో సగానికి ఒక ఓటు అదనంగా వచ్చినా అభ్యర్థి విజయం సాధించినట్టేనని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన 24 మంది ఓటర్లు మినహా మిగిలిన 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో దాదాపు 50కిపైగా ఓట్లు మజ్లీస్ అభ్యర్థికి పడినట్టు సమాచారం. దాంతో ఈ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ విజయం లాంఛనమేనని తెలుస్తోంది. సుమారు 22 ఏండ్ల తర్వాత లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరిగింది. అంతకు ముందు ఈ స్థానం ఎన్నిక ఏకగ్రీవమైంది . ఈసారి పోలింగ్, కౌంటింగ్ అనివార్యమైంది.

# రైతు క్షేమం కోసమే 'భూభారతి'

## రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

రైతు సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో మంగళవారం భూభారతిపై అవగాహనా సదస్సులో మంత్రి ప్రసంగించారు. ధరణి చట్టం దొరల స్వార్థం కోసం తెచ్చిన చట్టమన్నారు. ఆ చట్టంలోని లోపాలను సవరించి రైతు సంక్షేమం కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఒక రైతుకు ఉన్న ఆరు ఎకరాల భూమికి ధరణి చట్టం రాకముందు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే లబ్దిని పొందారని, ధరణి వచ్చాక భూమే తన పేరు మీద లేకుండాపోయిందని అన్నారు. ఇలా అనేక మంది రైతులకు సమస్యలు ఉన్నాయన్నారు. వంశ పారంపర్యంగా వచ్చిన భూమి గతంలో రికార్డులో, పట్టాదారి పుస్తకంలో ఉన్నప్పటికీ ధరణి చట్టంతో ఆన్‌లైన్ రికార్డులు కనపడక రైతులు అధికారులు,



కోర్టుల చుట్టూ తిరిగి అలసిపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరామ్మ రాజ్యంలో భూభారతి చట్టంపై కోదండరెడ్డితో ఒక కమిటీ వేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో వచ్చిన రెండు లక్షల 46వేల దరఖాస్తులను, ప్రస్తుత మూడున్నర లక్షల దరఖాస్తులను ఏడాది నాలుగు నెలల్లోనే పరిష్కరించినట్టు చెప్పారు. గతంలో ఒక్క కలెక్టర్‌కే ఉన్న అధికారాలను విభజించి తహసీల్దార్, ఆర్డీవోకు విభజించామని, అధికార వికేంద్రీకరణ చేశామని తెలిపారు. 18 రాష్ట్రాలకు అధికారులను పంపి అధ్యయనం చేయించిన తర్వాత ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. పేదవాడికి ఉపయోగపడే విధంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పారదర్శకంగా రైతులకు భూపట్టాలను ఇవ్వాలన్నారు. ప్రతి అధికారీ దాదాపు రైతు కుటుంబం నుండే వచ్చారు కాబట్టి ఆ బాధ వారికి తెలుసు అని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఏ రెవెన్యూ అధికారి తప్పు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మండలంలో ఉన్న జన్నారెడ్డి ప్రతాపరెడ్డి భూమిని 70 ఏండ్ల కిందట కొనుగోలు చేసి.. రికార్డులో, కబ్జాలో ఉన్న ప్రతి రైతుకూ పట్టాలు చేయడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆ అంశాలను తమ దగ్గరికి పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే కోరిక మేరకు నియోజకవర్గానికి 3500 ఇండ్లతో పాటు దశలవారీగా ఇంకా ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్‌పవార్, ఎస్పీ నరసింహ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఐదవ మహాసభలు

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర 5వ మహాసభలు ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో 2002 తర్వాత రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో 33 జిల్లాల నుంచి, 10 రాష్ట్ర యూనివర్సిటీలు, 6 సెంట్రల్ యూనివర్సిటీల నుంచి 600 మంది విద్యార్థి ప్రతినిధులు మూడు రోజుల పాటు పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు 25న ఉదయం 11:00 గంటలకు జడ్పీ సెంటర్ నుంచి వేలాది మందితో ప్రదర్శన ప్రారంభం అవుతుందని, అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. దీనికి అధికసంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వీపీ సాను, సినీ నటులు మాదాల రవి, ఆహ్వాన సంఘం చైర్మెన్ మువ్వా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటిసారి ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు ప్రాతినిధ్యం ఇస్తోందన్నారు. ఈ మహాసభలను ఖమ్మం జిల్లా విద్యార్థిలోకం, మేధావులు, విద్యావంతులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దొంతబోయిన వెంకటేష్, నాయకులు వినోద్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి

## రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**బలగం టీవీ, హైదరాబాద్**

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో రాష్ట్రంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా బుధవారం చలో ఉస్మానియా యూనివర్సిటీకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్ని యూనివర్సిటీల నుంచి ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్న 300 మంది అధ్యాపకులు ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి పరిపాలన భవనం దగ్గరికి చేరుకున్నారు. అక్కడ సభలో ఎంపీ మాట్లాడారు. కాంట్రాక్టర్ అధ్యాపకుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం అన్నారు. అనవసరమైన వాటికి రూ. వందలు వేల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం అధ్యాపకుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కొంత ఖర్చు పెట్టలేదా అని ప్రశ్నించారు. ఈ విషయమై సమస్య తీరే వరకు మీతోనే ఉంటానని భరోసా ఇచ్చారు. సీఎం కాస్త లౌక్యంతో ఉండాలని, పోలీసులతో కాకుండా ప్రజల్లో మమేకం కావాలని కోరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వారి పోరాటానికి మద్దతుగా మాట్లాడారు. ఈ సమస్యపై వీలైతే సీఎంతో మాట్లాడతానని, అవసరమైతే ఈ విషయంలో గవర్నర్‌ను కూడా కలుస్తానని చెప్పారు. పీడబ్ల్యూ నాయకులు సంధ్యా మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయటానికి ప్రభుత్వానికి వచ్చిన అడ్డంకి ఏమిటో చెప్పాలన్నారు. ఇంత మందిని ఇన్ని సంవత్సరాలుగా శ్రమ దోపిడీ చేయడం అన్యాయమన్నారు. వెంటనే వీళ్లందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మెన్ ఆచార్య పాపిరెడ్డి మాట్లాడుతూ.. రెగ్యులరైజ్ చేయడానికి ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులు లేవని, ఉన్నత విద్యామండలికి సంబంధించిన అడ్డంకులు లేవని అన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే సరిపోతుందని తెలిపారు. రెగ్యులరైజేషన్‌కు కొంత సమయం పట్టే సందర్భంలో తక్షణమే కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ ఉద్యోగ భద్రత కూడిన యూజీసీ పే స్కేల్ ఇచ్చి కొంత న్యాయం చేయొచ్చు అని తెలిపారు. మీ పోరాటాన్ని, ఐక్యత ఇలాగే కొనసాగించండి, త్వరలోనే విజయం సాధిస్తారని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహన బాధ్యులు, నాయకులు డాక్టర్ పరుశురాం, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ శైలజ రెడ్డి, డాక్టర్ ప్రియ, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టర్ నిరంజన్, పాలమూరు యూనివర్సిటీ నుంచి డాక్టర్ భూమయ్య, తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టర్ జోష్నా, శాతవాహన ఆర్జీయూకేటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ ఉగ్రదాడికి ఏఐఐఇఎ ఖండన

**బలగం టీవీ, హైదరాబాద్**

కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షులు వి.రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ హింసాత్మక ఘటనలో ఇండోర్ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్న సుశీల్ నతానియేల్ సహా 28 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దుఃఖాన్ని కలిగించిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పాశవిక చర్య మన దేశ శాంతి, మానవత్వం, విలువలపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ అమానుష చర్యకు పాల్పడిన వారిని త్వరగా గుర్తించి, కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్లకే కమిటీలలో చోటు

## మీనాక్షి నటరాజన్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్ట పరచాలని అభిప్రాయపడ్డారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్.. బ్రిటిష్ వాళ్ళతో కూడా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసిందని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనలతో పార్టీ పని చేస్తుందని వెల్లడించారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మీనాక్షి మాట్లాడుతూ, జిల్లాకు ఇద్దరు పరిశీలకుల కేటాయింలన్నారు. . మండల అధ్యక్షుల ఎంపికకు ఐదుగురి పేర్లు.. బ్లాకు కాంగ్రెస్ కి ముగ్గురు పేర్లు పీసీసీకి ఇవ్వాలని కోరారు. 70 మంది పరిశీలకులకు ఆహ్వానం పంపించాలని కోరారు. ఇక ఈ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వాళ్ళను పరిశీలకులుగా పీసీసీ తొలగించింది. మీటింగ్ కి రాని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ఐదుగురు నేతలు పరిశీలకుల నుంచి వీళ్ళను తొలగించాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేశారు.

ఇక, 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్ళనే కమిటీలో ఉండాలని నటరాజన్ ఆదేశించారు. అలాగే, మహిళల ప్రాతినిధ్యం పెంచుకోవాలన్నారు..ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు జరగనున్నాయని ప్రకటించారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలి అని సూచనలు చేశారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్ గా పని చేయాలని హెచ్చరించారు. ఈ దేశంలోనే మొదటి సరిగా తెలంగాణలో కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా



అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిదన్నారు.. అయితే, దేశంలో మోడీ సర్కార్, గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి అని మీనాక్షి నజరాజన్ కాంగ్రెస్ పరిశీలకులను కోరారు.

టీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణు నాథ్, సీడబ్ల్యూసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమైన అనంతరం జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల మృతి పట్ల సంతాపం ప్రకటించారు.. హాజరైన సభ్యులు లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# అఘోరీ అరెస్ట్

## చేవెళ్ల కోర్టులో 14 రోజుల రిమాండ్

## ట్రాన్స్‌జెండర్ కావడంతో సంగారెడ్డి జైలులో అనుమతి నిరాకరణ

**బలగం టీవీ, హైదరాబాద్**

చీటింగ్ కేసులో మోకిలా పోలీసులు అఘోరీని అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ.. ప్రగతి రిసార్ట్స్‌లో పనిచేస్తూ అఘోరీకి పరిచయమైంది. పూజల పేరుతో ఆమె వద్ద రూ.9.50 లక్షలు తీసుకొని మోసం చేశారనే ఫిర్యాదు నేపథ్యంలో అఘోరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో అఘోరీని అదుపులోకి తీసుకుని మంగళవారం సాయంత్రం నగరానికి మోకిలా పోలీసులు తీసుకొచ్చినట్టు తెలిసింది. అఘోరీతో పాటు ఇటీవల తాను వివాహం చేసుకున్న వర్షిణిని సైతం నగరానికి తరలించినట్టు సమాచారం. ఇది ఇలా ఉండగా ఏపీకి చెందిన వర్షిణి ఇటీవల అఘోరీని పెండ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వర్షిణి కుటుంబానికి ఇష్టం లేకున్నా బలవంతంగా కేదార్‌నాథ్ తీసుకువెళ్లి పెండ్లి చేసుకుందన్న ఆరోపణలున్నాయి. ఇక వాళ్ల పెండ్లికి సంబంధించిన వీడియో మొన్నటి నుంచి వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. తమను ఎవరైనా అరెస్టు చేయాలని చూస్తే.. ఆత్మహత్య చేసుకుంటామని ఈ జంట మొన్న ప్రకటించి ఓ సెల్ఫీ వీడియో సైతం విడుదల చేసింది. కేదార్‌నాథ్ వెళ్ళిపోతున్నామని, ఇకపై తెలుగు రాష్ట్రాలకు రాబోమని ప్రకటించారు. కాగా, అరెస్ట్ చేసిన అఘోరిని బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించి 2 గంటల పాటు విచారించారు. అనంతరం పోలీసు బందోబస్తు నడుమ చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి చేవెళ్ల కోర్టులో హాజరుపరిచారు. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని అఘోరీ విన్నవించడంతో లీగల్ ఎయిడ్ సర్వీసెస్ తరపున న్యాయవాది కుమార్‌ను జడ్జి నియమించారు. వాదనలు విన్న జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. కాగా, చేవెళ్ల కోర్టు నుంచి అఘోరినీ సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని సెంట్రల్ జైలుకు తరలించారు. అఘోరీ.. ట్రాన్స్‌జెండర్ కావడంతో ఏ బ్యారక్‌లో ఉంచలేమని, లింగ నిర్ధారణ జరిగితేగాని ఇక్కడ ఉంచుకోలేమంటూ అధికారులు చెప్పడంతో తిరిగి కోర్టుకు పంపించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు డాక్టర్ల వైద్య పరీక్షల అనంతరం లింగ నిర్ధారణ జరగనుంది. ఈ రిపోర్టు ఆధారంగా.. చంచల్‌గూడ జైలులో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక బ్లాక్ ఉండటంతో అక్కడి తరలించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

# పైలట్ ప్రాజెక్ట్ గ్రామాలు, వార్డుల్లో లక్ష్యం పూర్తి చేయాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమస్య సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయమని, ఇందిరమ్మ ఇండ్ల గ్రామ, కమిటీలు గుర్తించిన వారితో పాటుగా ఎవరైనా నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇండ్లు ఇవ్వాలనిఅన్నారు. గ్రామాలు, వార్డుల్లో గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన గృహాలను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చవద్దని,ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిపై తర్వాత నిర్ణయం తీసుకుంటమనిఅన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని,రవాణా ఛార్జీలు మాత్రమే లబ్దిదారు చెల్లించాలనిఅన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక అయిన గ్రామాలు, వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని,ఈ మేరకు అధికారులు సమన్వయంతో పని చేసి ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో అధికారులు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్హులకు ఇండ్ల నిర్మాణాలపై సూచనలు అందించాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, సర్వే వివరాలు ప్రతి రోజూ సాయంత్రం తమకు పంపించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, పీడీ హౌసింగ్ శంకర్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న దర్శించుకున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పి.నీరజ

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ని రాజన్న జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి పి.నీరజ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా జడ్జి కి వేములవాడ సబ్ కోర్టు జడ్జి అజయ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి కిరణ్మయి ఆలయ ఈ.ఓ కె వినోద్ లు పూల మొక్క అందించి స్వాగతం పలికారు,ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక స్వాములు జిల్లా జడ్జి కి పూర్ణ కుంభ స్వాగతం పలికారు.స్వామి వారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం గావించి స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేశారు.

## స్వీయ రక్షణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

**బలగం టీవీ, సిరిసిల్ల**

స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే సిబ్బంది కి ఎస్పీ మహేష్ బి. గితే హెల్మెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ నిత్యా విధులలో బిజీగా ఉండే పోలీస్ అధికారుల,సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని,విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండు విధులు నిర్వహించాలని,అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని డ్యూటీలు నిర్వహించే సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలనిఅన్నారు.ఇక్కడ సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ యాజమాన్యం , సిబ్బంది ఉన్నారు.

# భూభారతిపై రైతులకు అవగాహన కల్పించాలి..

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భూభారతి చట్టంపై అవగాహన సదస్సును వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో బుధవారం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ,భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూభారత చట్టాన్ని తీసుకువచ్చిందనిఅన్నారు. భూ సమస్యలతో బాధపడే వారంతా చట్టాన్ని సద్వినియం చేసుకొని హక్కులు పొందాలని, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని అన్నారు. గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని,ప్రజా ప్రభుత్వంలో 20 వేల కోట్ల పై చిలుకు రూపాయలతో 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందనిఅన్నారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కి సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు.ప్రజా ప్రతినిధులు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,హన్మాజీపేట్ పేట బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందనిఅన్నారు. హన్మాజీ ఎట్ పేట బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఎదురైతే తాను, కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కారం చేయడం జరిగిందనిఅన్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు – భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని అన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తారనిఅన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని అన్నరు.ఈ కార్యక్రమంలో ఏ ఎమ్ సీ ఛైర్మెన్ రొండి రాజు, వేములవాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు విజయ్ ప్రకాష్ రావు, అబూ బాకర్, వ్యవసాయ అధికారి సాయి కిరణ్ పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతులు తదితరులు ఉన్నారు.

## పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జమ్ము కాశ్మీర్ లోని పహల్గంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ, మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాం నాయకత్వంలో బుధవారం రోజున బోయినిపల్లి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పరశురాం మాట్లాడుతూ.. పహల్గంలో ఉగ్రవాదుల చేతిలో చంపబడిన 26 మంది అమాయక పర్యాటకులపై దాడిని భారతీయ జనతా పార్టీ మండలం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యను అనాగరిక చర్యగా అభివర్ణిస్తూ, మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, సంతాపాన్ని తెలియజేస్తున్నామని, దాడిలో గాయపడిన 20 మంది త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాని, ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను గుర్తించి, వారిని పెంచి ప్రోత్సహిస్తున్న ఉగ్రవాద సంస్థలను సమూలంగా తుడిచివేయాలని, ఉగ్రదాడుల్లో మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు బొంగాని అశోక్ గౌడ్, ఎస్సీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, సీనియర్ నాయకులు కిరణ్, కందాలపు వెంకటేష్, తిప్పరవేణి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బోగోజి గంగాధర్ చారి, మెరుపుల గంగాధర్, మోడీ నిఖిల్, నవీన్, రజనీకాంత్, ప్రసాద్, ప్రశాంత్, తిరుపతి, ఐలయ్య, అనిల్, రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ ఉగ్రదాడిని ఖండించిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా శాఖ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. అసోసియేషన్ అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనాపాల శంకరయ్య కార్యనిర్వహణలో జరిగిన సమావేశంలో ఈ దాడిలో మరణించినవారి కుటుంబాలకు సానుభూతి, సంతాపం తెలిపారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రశాంతంగా సాగిన టాస్ పరీక్షలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్. వీఎస్ జనార్దన్ రావు తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 784 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 703 మంది (89.67%) హాజరయ్యారు. 81 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం రెండు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 124 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 110 మంది (88.71%) హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.

## ప్రవస్తి మరో వీడియో విడుదల

**సింగర్ సునీతకు పలు ప్రశ్నలు**

**బలగం టీవీ, హైదరాబాద్**



వర్ధమాన గాయని ప్రవస్తి తాజాగా మరో వీడియో విడుదల చేశారు. తన యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేసిన ఈ వీడియోలో, ఆమె సింగర్ సునీతను ఉద్దేశించి పలు సూటి ప్రశ్నలు సంధించారు, వాటికి సమాధానాలు చెప్పాలని కోరారు.

"సునీత గారు, మీరు రీల్‌లో చక్కగా మాట్లాడారు, అదే నిజ జీవితంలో చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు" అంటూ ప్రవస్తి తన ప్రశ్నలను ప్రారంభించారు. ఛానల్ నిబంధనల మేరకే తాను పాటను ఎంపిక చేసుకుని, రిహార్సల్స్ కూడా పూర్తి చేశాక వద్దన్నారని, కానీ అదే పాటను అదే ఎపిసోడ్‌లో మరో అమ్మాయి పాడితే ప్రోత్సహించారని, ఎందుకిలా చేశారని ఆమె ప్రశ్నించారు. మరోసారి 'కన్యాకుమారి' పాట పాడకముందే జడ్జిమెంట్ ఇచ్చి వెళ్లడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పాట మధ్యలో సాహిత్యం మరచిపోయిన వారు, చేతిపై రాసుకుని వచ్చిన వారు ఫైనల్స్ వరకు ఎలా వెళ్లగలిగారని ఆమె నిలదీశారు. మ్యాంగో వీడియోలో పాడే అవకాశం సునీత ఇవ్వలేదని, తన గురువు నిహాల్ కొండూరి ద్వారా ఆ అవకాశం వచ్చిందని ప్రవస్తి స్పష్టం చేశారు. అనంతరం తనను సురక్షితంగా ఇంటికి పంపించానని సునీత చెప్పిన దాంట్లో నిజం లేదని, ఆ రోజు తన తల్లి తనతో లేదని పేర్కొన్నారు. పెళ్లిళ్లలో పాడేవారు గాయకులు కారంటూ కీరవాణి చేసిన కొన్ని వ్యాఖ్యలు తనను బాధించాయని, దానిని ప్రస్తావించడంలో తప్పేముందని అన్నారు. తనకు 19 ఏళ్లని, సంగీతం కోసం చదువు కూడా వదులుకున్నానని, ఐదేళ్ల వయసు నుంచే పోటీల్లో పాల్గొంటున్నానని ప్రవస్తి తెలిపారు. తాను ఎలాంటి డిప్రెషన్‌లో లేనని, అన్యాయం జరిగిందనే ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు. సునీతపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదని, ఆమె ఎప్పటికీ తన అభిమాన గాయనే అని పేర్కొన్నారు. తాను కొందరి పేర్లు ప్రస్తావించకపోయినా కూడా... ప్రస్తావించినట్లు చెప్పారని ప్రవస్తి అన్నారు.

## పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన క్రికెటర్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

పహల్గాం ఉగ్రదాడిని భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు ఖండించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతున్నారు.

"పహల్గాంలో జరిగిన దాడి వార్త విని నా గుండె విరిగిపోయింది. బాధితులు, వారి కుటుంబాల కోసం నేను ప్రార్థిస్తున్నారు. వారి గురించే నా ఆలోచనంత. మన దేశంలో ఇలాంటి హింసకు ఎలాంటి చోటు ఉండకూడదు. శాంతి చేకూరాలని ఆశిస్తున్నా" అని కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్ అన్నారు. "పహల్గాంలో టూరిస్టులపై జరిగిన దాడి బాధాకరం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఇలాంటి సమయంలోనే మనమంతా మానవత్వంతో, ఐక్యంగా కలిసి ఉండాలి" అని యువరాజ్ సింగ్ పేర్కొన్నాడు.

"పహల్గాంలో ఉగ్రదాడి ఘటన తెలుసుకుని షాక్ అయ్యాను. ఎంతో తీవ్రంగా బాధించింది. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాను. ఈ భయంకరమైన భీకర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబాలు బలంగా తిరిగి కోలుకోవాలని ఆశిస్తున్నాను. కచ్చితంగా అందరికీ న్యాయం జరగాలని కోరుకుంటున్నాను" అని విరాట్ కోహ్లీ పేర్కొన్నాడు."ప్రతిసారీ అమాయకులే జీవితాలను కోల్పోతున్నారు. కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఘటన హృదయవిదారకంగా ఉంది. కొన్ని రోజుల కిందటే అక్కడ ఉన్నా. ఈ బాధ మరింత ఎక్కువగా ఉంది" – ఇర్ఫాన్ పఠాన్."మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ దురాఘాతానికి వారు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారు. భారత్ ప్రతీకారం తీసుకుంటుంది." – గౌతమ్ గంభీర్ అన్నాడు."పహల్గాం దాడి ఘటన తీవ్రంగా బాధించింది. అమాయకమైన పర్యటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమైన విషయం. బాధిత కుటుంబాలకు అండగా ఉందాం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిద్దాం" అని వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. "నన్ను ఈ విషయం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బాధితుల గురించే నా ఆలోచన. వారి కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉంది" అని హార్దిక్ పాండ్య చెప్పాడు.

భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అమిత్ షా నివాళులర్పిస్తున్న చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన, విషాదకరమైన ఉగ్రవాద దాడి గురించి ఇప్పుడే చదివానని రాశారు. ఇది చాలా బాధాకరమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. మతం పేరుతో అమాయక ప్రజలను చంపడం చాలా దుర్మార్గమైన, అమానుషమైన చర్య అని.. ఏ కారణం లేదా ఆలోచన అటువంటి క్రూరమైన చర్యను సమర్థించదని సిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది ఎలాంటి పోరాటం, ఇక్కడ మానవ ప్రాణాలకు విలువ లేదు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్ర దుఃఖం, షాక్ గురించి ఆలోచించడం హృదయాన్ని బాధపెడుతుంది. ఈ కష్ట సమయాన్ని అధిగమించడానికి ఆ కుటుంబాలకు బలం చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. వారి మృతికి చాలా చింతిస్తున్నాము. ఈ హింస త్వరలోనే ఆగిపోతుందని, దోషులకు కఠిన శిక్ష పడుతుందని, తద్వారా వారు ఎవరికీ హాని కలిగించకూడదని ఆశిస్తున్నాను." అని మహ్మద్ సిరాజ్ రాసుకొచ్చాడు.

టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ కూడా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ పిరికి చర్యపై తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. "పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి గురించి ఇప్పుడే చదివాను. మతం పేరుతో అమాయకులను లక్ష్యంగా చేసుకుని చంపడం పూర్తిగా తప్పు. ఏ కారణం, ఏ భావజాలం కూడా ఇంత భయంకరమైన చర్యను సమర్థించలేదు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల మేము తీవ్రంగా బాధపడుతున్నాము. ఈ పిచ్చి త్వరలోనే ముగిసిపోతుందని, ఈ ఉగ్రవాదులను ఎటువంటి దయ లేకుండా కనుగొని శిక్షించాలని నేను ఆశిస్తున్నాను."అని మహ్మద్ షమీ ఇన్‌స్టా వేదికగా రాసుకొచ్చాడు.

## సన్‌రైజర్స్‌పై ముంబై ఇండియన్స్ విజయం

- 7 వికెట్ల తేడాతో విజయం
- హైదరాబాద్‌కు ఆరో ఓటమి
- ముంబైకు ఐదో విజయం




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్‌లో ఓ వైపు ముంబై ఇండియన్స్ విజయాలతో దూసుకుపోతుండగా మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ పరాజయాల పరంపర అలాగే కొనసాగుతోంది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.

మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ జట్టులో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పూర్తిగా విఫలమయ్యారు. ఇషాన్ కిషన్ (1) బ్యాట్‌ను తాకకుండా బంతి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్లింది. అయితే అతను అనూహ్యంగా మైదానం విడిచి వెళ్లాడు. ముందుగా దీపక్ చాహర్ వేసిన బంతి లెగ్ సైడ్ వెలుపలికి వెళుతుండగా, అంపైర్ వైడ్ గా ప్రకటించాడు కానీ కిషన్ వెనక్కి వెళ్లడం చూసి,అంపైర్ తన వేలును పైకెత్తాడు. ట్రావిస్ హెడ్ (0) ట్రెంట్ బౌల్ట్ వేసిన బంతిని థర్డ్ మ్యాన్ దిశగా ఆడగా.. నమన్ ధీర్ క్యాచ్ తీసుకోవడంతో ఔటయ్యాడు. అభిషేక్ శర్మ (ఎనిమిది) సిక్స్ తో ఆరంభించాడు కానీ బౌల్ట్ బౌలింగ్ లో విఘ్నేష్ పుతూర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇంతలో దీపక్ చాహర్ బౌలింగ్‌లో మిడ్–ఆన్‌లో మిచెల్ సాంట్నర్‌కు నితీష్ కుమార్ రెడ్డి క్యాచ్ ఇచ్చాడు. పవర్ ప్లేలో సన్‌రైజర్స్ 24 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది.

హెన్రిచ్ క్లాసెన్ 44 బంతుల్లో 71 పరుగులు, అభినవ్ మనోహర్ 43 పరుగులు సన్‌రైజర్స్ హైదరాబాద్ 143 స్కోరును చేరుకోవడానికి సహాయపడ్డారు. ట్రెంట్ బౌల్ట్ 4 ఓవర్లలో 26 పరుగులకు 4 వికెట్లు పడగొట్టగా, దీపక్ చాహర్ 4 ఓవర్లలో 12 పరుగులకు 2 వికెట్లు పడగొట్టాడు.

సన్‌రైజర్స్‌ను 143 పరుగులకే కట్టడి చేసిన ముంబై ఇండియన్స్‌కు శుభారంభం దక్కలేదు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రియాన్ రికెల్టన్(11)ను జయాద్కాట్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. ఆ తర్వాత విల్ జాక్స్(22) అండగా రోహిత్ శర్మ(70) మెరిశాడు. ఈ ఇద్దరూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగగా ముంబై 6 ఓవర్లలోనే 56 పరుగులు చేసింది. ముంబైని గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ జోడీని జీషన్ విడదీశాడు. ధాటిగా ఆడుతున్న జాక్స్‌ను పెవిలియన్ పంపాడు. దాంతో, 77 వద్ద రెండో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(40).. తన మార్క్ షాట్లతో అలరిస్తూ లక్ష్యాన్ని కరిగించాడు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచిన రోహిత్.. విజయానికి 14 పరుగుల దూరంలో ఔటయ్యాడు. తిలక్ వర్మ(2)తో కలిసి సూర్య లాంఛనం ముగించాడు. జీషన్ వేసిన 16వ ఓవర్లో రెండు ఫోర్లతో ముంబైని గెలిపించాడు. దాంతో, పాండ్యా సేన వరుసగా నాలుగో విజయంతో 10 పాయింట్లు సాధించింది.



## 'కల్కి 2' మ్యాజిక్ కోసం ఎదురు చూస్తున్నా

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' గతేడాది విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. ఆ సినిమా సీక్వెల్ కోసం అందరూ ఆసక్తి ఎదురు చూస్తున్నారు. కాగా బుధవారం నాగ్‌అశ్విన్ పుట్టిరోజు. అయితే నాగ్ అశ్విన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'కల్కి 2' మ్యాజిక్ కోసం ఎదురుచూస్తున్న అంటూ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పెట్టారు.

'కల్కి' సినిమాలో ప్రభాస్ కోసం డిజైన్? చేసిన 'బుజ్జి' కారులో నాగ్? అశ్విన్? కూర్చున్న ఫొటోను షేర్ చేస్తూ విషెస్ చెప్పారు ప్రభాస్.' ఈ అద్భుతమైన వ్యక్తికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు. నాగి నీ విజన్, నిబద్ధత నన్ను ఎప్పుడూ ప్రేరేపిస్తూనే ఉంటాయి. ఇంకా ఎక్కువ కాలం ఎదురుచూడలేను. 'కల్కి 2'లో చూపించే మ్యాజిక్? కోసం చాలా ఉత్సాహంగా ఉన్నా' అని స్టోరీలో రాసుకొచ్చారు. దీంతో ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ సీక్వెల్‌లో ఎన్నో మాయాజాలాలు ఉండనున్నట్లు అర్థమవుతుంది .

కాగా, కల్కి 2పై స్పందించిన నాగ్ అశ్విన్ ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిపారు. పార్ట్ 2లో ప్రభాస్ ఎక్కువసేపు స్క్రీన్‌పై కనిపిస్తారని అన్నారు. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుందని చెప్పారు. రెండో భాగంలో వీరిద్దరి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## బంగ్లాదేశ్‌పై జింబాబ్వే విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో జింబాబ్వే మూడు వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో జింబాబ్వే 174 పరుగుల లక్ష్యాన్ని ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జింబాబ్వే టెస్టుల్లో తొలి విజయం అందుకుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి టెస్టులో జింబాబ్వే అంచనాలకు మించి రాణించింది. ఆతిథ్య బంగ్లాను తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే పరిమితం చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బంగ్లాను 273 పరుగులకే కట్టడి చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు సాధించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 174 పరుగుల లక్ష్యాన్ని సయితం ఛేదించింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (54), బెన్ కరన్ (44) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. పిచ్‌కు బౌలింగ్‌కు సహకరిస్తున్న జింబాబ్వే బ్యాటర్లు సమష్టిగా రాణించి జట్టుకు చారిత్రక విజయం సాధించి పెట్టారు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 9 వికెట్లు తీసిన ముజరబ్బానికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.





## అమెజాన్ ప్రైమ్‌లోకి 'మసూద'

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యువ నటులు సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హిట్ చిత్రం మసూద. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రాన్ని స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా.. సాయి కిరణ్ దర్శకత్వం వహించాడు. నవంబర్ 18 2022న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రస్తుతం తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తెలుగులో మాత్రమే ఈ సినిమా అందుబాటులో ఉండడంతో వేరే భాష ప్రేక్షకులకు రీచ్ కాలేకపోయింది. అయితే ఈ మూవీ వచ్చిన దాదాపు 3 ఏండ్ల తర్వాత మరో ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది ఈ చిత్రం. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియలో ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు ఇతర భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.



## 'ది రాజా సాబ్'పై మారుతి కీలక అప్‌డేట్

**బలగం టీవీ, హైదరాబాద్**

%పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ది రాజా సాబ్' ఈ సినిమాను దర్శకుడు మారుతి తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీ ఎలా ఉండబోతుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పూర్తి హార్రర్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమాను మేకర్స్ రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ప్రశ్న అభిమానుల నుంచి గతకొద్ది రోజులుగా వినిపిస్తోంది. గతంలో ఏప్రిల్ 10న ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. కానీ, ఈ సినిమా పనుల్లో ఆలస్యం అవుతుండటంతో ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ సినిమా రిలీజ్‌పై దర్శకుడు మారుతి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చాడు. ఓ ఆటోరిక్షాపై రాజాసాబ్‌లోని ప్రభాస్ ఫోటో ఉండటాన్ని ఆయన తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోకు ఆయన 'అలర్ట్.. వేడి గాలులు మే లో మరింతగా పెరగనున్నాయి' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. దీంతో త్వరలోనే రాజా సాబ్ నుంచి త్వరలోనే ఓ సాలిడ్ అప్డేట్ అయితే రానుందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.